

● తలమడుగు మండలంలో వరదనీటి ఉధృతికి నేలకొరిగిన పత్తి పంట



● చాందా వాగులో భారీ వరదనీటి ప్రవాహం

జిల్లావ్యాప్తంగా.. జోరు వాన

- జిల్లాలో 79.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు
- సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల వరదగేట్ల ఎత్తివేత
- ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగా నది.. పంట చేలలోకి చేరిన వరదనీరు
- భారీ వర్షానికి జన జీవనం అతలాకుతలం
- నేడు విద్యా సంస్థలకు సెలవు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న జిల్లా అధికారులు
- మరో 2రోజుల పాటు భారీ వర్ష సూచన
- జిల్లావాప్తంగా భారీ వర్షాలతో రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ

ఆదిలాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నా యి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా జోరువాన కురుస్తునే ఉంది. జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువడం తో వాతావరణ శాఖ రెడ్‌అలర్ట్‌ను ప్రకటించింది. ఆదివారం జిల్లా సగటున 79.1 మి.మీల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 133.8 మీ.మీ.ల అతి భారీ వర్షం కురిసింది. ఆదిలాబాద్ అర్బన్‌లో 124.0, నార్నూర్ 92.3, జైనథ్ 90.4, తాంసి 88.0, బోథ్ 87.6, ఇంద్రవెల్లిలో 82.5 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా 14 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. మిగితా నాలుగు మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. అలాగే కడెం నదికి వరదనీటి ప్రవాహం పెరగడంతో కుంటాల, పొచ్చెర జలపాతాలు వరద నీటితో పరవళ్లు పెడుతున్నాయి. మరో రెండు రోజుల పాటు జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. భారీ వర్షాల కారణంగా సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. జిల్లాకేంద్రంతో పాటు పలు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు, పంట చేలు నీట మునిగాయి. వరద నీటితో కుంటాల, పొచ్చెర, గాయత్రి జలపాతాలు పరవళ్లు పెడుతున్నాయి. మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. జల పాతాలు, వాగులు, ప్రాజెక్టుల వద్ద పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్రాజెక్టుల వరద గేట్ల ఎత్తివేత

జిల్లాలో ప్రధానంగా చెప్పుకునే సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులతున్నారు. ఆదివారం మధ్యాహ్నం సాత్నాల ప్రాజెక్టు మూడు వరదగేట్లను ఎత్తి వేశారు. అలాగే మత్తడివాగు ప్రాజెక్టు రెండు వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 286.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 285.75 మీటర్లు ఉంది. అలాగే మత్తడి వాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 287.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 277.0 మీటర్లకు చేరుకుంది. ఇంకా ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వచ్చి చేరింది. ప్రాజెక్టుల దిగువన ఉన్న గ్రామాలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఏక్షణంలోనైనా మళ్లీ వరదగేట్లను ఎత్తే అవకాశం కనిపిస్తోంది. ఈ సీజన్‌లో ప్రాజెక్టుల వరద గేట్లను ఎత్తడం ఇదే మొదటిసారి. మరో రెండు రోజుల పాటు జిల్లాకు భారీ వర్ష సూచన ఉండడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు.

పెన్‌గంగా నదికి భారీ వరద

జిల్లాతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడంతో పెన్‌గంగా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని పంట చేలు నీట మునుగుతున్నాయి. ముఖ్యంగా భీంపూర్, తాంసి, జైనథ్, బేల మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జైనథ్ మండలం ఆనంద్‌పూర్ వద్ద ఉన్న బ్రిడ్జిపై నుంచి వరదనీరు పొంగి ప్రవహించడంతో మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే కరంజి, పెండల్‌వాడ, సాంగ్వి, తదితర గ్రామాల్లోని పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలో ఉన్న పత్తి, కంది, సోయా పంటలు నీట మునగడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెన్‌గంగా నది ఉధృతంగా ప్రవహించడంతో పరిసర ప్రాంతాలకు రైతులు వెళ్లవద్దంటూ అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా పోలీసులు నిఘా సారించారు. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లో వరద నీరు చేరడంతో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. పెన్‌గంగా ఉధృతి ఇలానే కొనసాగితే వేల ఎకరాలలో పంట దెబ్బతినే అవకాశం ఉందంటున్నారు.

స్థంభించిన జనజీవనం

జిల్లాలో గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం పూర్తిగా స్థంభించింది ఆదివారం సెలవుదినం కావడంతో జనజీవనం పూర్తిగా స్థంభించి పోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షపు నీరు రోడ్లపై ప్రవహించడంతో చిన్నపాటి చెరువులను తలపిస్తు న్నాయి. జిల్లా కేంద్రంలోని శివారు కాలనీలలో మురికి కాలువలు ముంచెత్తాయి. పలు ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరింది. ముఖ్యంగా ఖానాపూర్, తిర్పెల్లి, వాల్మీకినగర్, రణదివ్యనగర్, తాటిగూడ, బొక్కల్‌గూడ, జైజవాన్‌నగర్, క్రాంతినగర్, జీఎస్టేట్ కాలనీలోని ఇళ్లలోకి వరదనీరు చేరింది. అలాగే వాగులు పొంగి ప్రవహించడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. ఇంద్రవెల్లి మండలం వడ్గావ్ గ్రామ పంచాయతీ పరిధిలోని జైత్రం తండా వాసులకు వరదనీటిని దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు గ్రామాలను విడిచి బయటకు రాలేదు. లోతట్టు కల్వర్టులను దాటేందుకు అవకాశం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు పంట చేన్లలోకి వరదనీరు చేరి పంటలను ముంచెత్తింది. జిల్లావ్యాప్తంగా కురిసిన భారీవర్షం జిల్లాను అతలాకుతలం చేసింది.



పరవళ్లు తొక్కుతున్న కుంటాల జలపాతం



ఉప్పొంగి ప్రవహిస్తున్న పొచ్చెర జలపాతం

భారీ వరదనీటితో జలపాతాల పరవళ్లు

నేరడిగొండ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని కుంటాల జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుంది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలపాతం వద్ద ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా మూడు రోజుల పాటు పర్యాటకులకు అనుమతి నిలిపివేస్తున్న ట్లు ఎఫ్ఆర్‌వో గణేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

● పొచ్చెర జలపాతానికి వరద పోటు

బోథ్: మండలంలో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. బోథ్‌పై బాగంలో భారీ వర్షలు కురవడంతో జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో జలపాతం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షిప్త సమాచారం

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 1: జిల్లావ్యాప్తంగా సోమవారం కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నిపునులు హెచ్చరించారు. కావున రైతులు వాగులు దాటి పంట పొలాల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు కరెంటు స్తంభాల వద్ద నిలువరాదని, ఇళ్లలోనే ఉంటూ అధికారులు చెప్పే జాగ్రత్తలను ప్రతీఒక్కరు పాటించాలని ఎంపీ గోడం నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా ఎక్కడైన ప్రమాదం వాటిల్లితే వెంటనే స్థానిక పోలీసుకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు సూచించారు.

● వాగులను దాట వద్దు : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్: బంగాళకాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు వంకలు కలిగిన గ్రామాల ప్రజలు వాగుల్లో నీళ్ల ప్రవహించే సమయంలో వాగులను దాటే ప్రయత్నం వద్దని, ఆపద సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని, లేదా నేరుగా తనకు ఫోన్ చేయాలన్నారు.

● అత్యవసరమైతే రావాలి : ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్ రూరల్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. పట్టణంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అత్యవసరం ఉంటేనే బయటికి రావాలన్నారు. వర్షాల వల్ల తడిసిన కరెంటు స్తంభాలు, విద్యుత్ తీగలు, ఇనుప స్తంభాలను తాకకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కాల్వలు, చెరువుల వద్దకు వెళ్లొద్దని సూచించారు.

బోథ్: మండలంలోని కరత్వాడ వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వాగు ఉధృతిని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జి.రాజు యాదవ్ సందర్శించి గ్రామస్థులు సూచనలు చేశారు. గ్రామస్థులు బయటకు రావొద్దని, వరద ఉధృతి మరింతగా పెరిగే అస్కారం ఉందని గ్రామస్థులకు వివరించారు.



పిచ్చిమొక్కలతో ఉన్న సోనాల పశు వైద్యశాల

మరమ్మతులు చేపట్టరూ..!

బోథ్, సెప్టెంబరు 1: సోనాల గ్రామంలో ఉన్న పశువైద్యశాల నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించారు. నిర్మించినప్పటికీ నుంచి అధికారులు దాని వైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా పశు వైద్యశాలపైన చుట్టూ పక్కల పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిసింది అంటే అందులో విధులు నిర్వహించేందుకు సిబ్బంది జంకుతున్నారు. అధికారులు ఆసుపత్రికి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పాలకులు పశువైద్యశాలపై నిర్లక్ష్యం చేయవద్దని వందల పశువులకు వైద్యం అందిస్తున్న ఆసుపత్రిని పూర్తిస్థాయి వినియోగంలోకి తెచ్చే విధంగా చూడాలని కోరుతున్నారు.

గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం

● రోజురోజుకూ విజృంభిస్తున్న డెంగీ, విష జ్వరాలు ● పల్లెల వైపు కన్నెత్తి చూడని సంబంధిత శాఖల అధికారులు

తలమడుగు, సెప్టెంబరు 1: జిల్లాలోని పలు గ్రామాల్లో రోజురోజుకూ చెత్తాచెదారం పేరుకుపోయి మురికి కాలువలు నిండి రోడ్లపై ప్రవహిస్తూ గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. అంతేకాకుండా దుర్గంధమైన వాసనతో డెంగీ, విష జ్వరాలు వ్యాపిస్తున్నా.. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో విష జ్వరాలు పడగవిప్పుతున్నా.. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామీణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ అధికారులు సైతం వారానికి రెండు సార్లు నామ్‌కే వాస్తేగా వస్తూ వెళుతున్నారు తప్ప పారిశుధ్యంపై చర్యలు చేపట్టడం లేదని గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ మండలంలో ఇద్దరికి డెంగ్యూ జ్వరాలు వచ్చి మంచాన పడ్డారు. అంతేకాకుండా ప్రతీ గ్రామంలో జ్వరాలతో ఇబ్బంది పడుతున్న వైద్య సిబ్బంది స్పందించడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వర్షాలు జోరుగా పడటంతో గ్రామాల్లో మరింత పారిశుధ్యం లోపించి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల మండలంలోని కొత్తూరు గ్రామంలో ఒకరికి డెంగ్యూ సోకింది. మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో మరో విద్యార్థికి డెంగ్యూ జ్వరం వచ్చింది. అంతేకాకుండా సుంకిడి గ్రామంలో విష జ్వరాలు వ్యాప్తి చెందాయని గ్రామస్థులు తెలిపారు. అధికారులు గ్రామాల్లో ఉండి సమస్యలు పరిష్కరించాల్సింది పోగా.. ప్రతీరోజు జిల్లాకేంద్రం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కొంతమంది అధికారులు గ్రామానికి వారానికి రెండు సార్లు గ్రామాల్లోకి వస్తున్నారని గ్రామీణ ప్రజలు పేర్కొన్నారు. సుంకిడి గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని గ్రామస్థులు తెలిపారు. గ్రామాలు ఇప్పటి వరకు ఎలాంటి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. అంతేగాక వీధి దీపాలు లేక రాత్రిపూట చీకట్లోనే ఉండవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాల్లో లోపించిన పారిశుధ్యాన్ని తొలగించి వ్యాధులు ప్రబలకుండా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.





● సుంకిడిలో రోడ్లపైన, మురికి కాలువ శుభ్రపరచకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయిన దృశ్యం

నేడు ఉపాధి హామీ పథకం ప్రజావేదిక

నేరడిగొండ, సెప్టెంబరు 1: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఉపాధి హామీ పథకం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి మండలంలోని అన్ని గ్రామాల్లో ఈజీఎస్ పథకం కింద చేపట్టిన పనులపై డీఆర్డీఏ ఆదేశాల మేరకు ఈ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల కార్యదర్శులు, బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, ఈజీఎస్ సిబ్బంది హాజరు కావాలని సూచించారు.

అవహేళన చేసేలా మాట్లాడుతున్న పార్టీలు

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 1: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ విషయంలో కాంగ్రెస్, బీజేపీలు అత్యున్నత న్యాయస్థానాన్ని అవహేళన చేసేలాగా మాట్లాడుతున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కవితకు బెయిల్ రావడం పట్ల బీజేపీ, కాంగ్రెస్ బీఆర్ఎస్ ములాకత్ అయ్యాయని, సుప్రీం కోర్టు నుంచి బెయిల్ వచ్చిందని ఒకరిపై ఒకరు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఈ రెండు పార్టీలు ఒక్కటేనని, ప్రజల ఆత్మగౌరవం నుంచి పుట్టిన బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయాలని కుట్రలు చేస్తున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నుంచి 8, బీజేపీ నుంచి 8 మంది ఎంపీలున్నా.. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపిన మాట్లాడలేదని పలు విమర్శలు చేశారు. ఇందులో రైతు సమన్వయ జిల్లా అధ్యక్షుడు రోకండ్ల రమేష్, పట్టణాధ్యక్షుడు అజయ్, ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ, మార్కెట్ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, శివ జగదీష్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్

మతతత్వ రాజకీయాలకు చోటు లేదు

● మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 1: మతతత్వ రాజకీయాలకు చోటు లేదని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి విశేష స్పందన లభిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్ అన్నారు. మతపరమైన విద్వేశాలకు వెళ్లకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని, మంచి ఆలోచన ధృక్పథంతో ముందుకు సాగాలన్నారు. భవిష్యత్తు మొత్తం కాంగ్రెస్ పార్టీదే అధికారమని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సైతం అదే లక్ష్యంతో ఉందన్నారు. ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందువులు, ముస్లిములు, సిక్కులు, బౌద్ధులు అన్న మతపరమైన విభేదాలకు వెళ్లకుండా పాలు, చక్కెరలా అందరూ ఐక్యతగా మెలగాలని ఆకాంక్షించారు. విభజించి పాలించు విధానాన్ని బీజేపీ అవలంభిస్తోందని వ్యాఖ్యనించారు. కాంగ్రెస్ పార్టీ అన్నివర్గాలను ఏకం చేసేలా ముందుకెళ్తోందన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగిసిందని, జూడో యాత్ర మొదలు కాబోతోందని తెలిపారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పి విస్మరించిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. ప్రతీఒక్కరి తలసరి ఆదాయం పెరగాలన్నదే తన లక్ష్యమన్నారు. దేశమంతా ఏకతాటిపైకొచ్చి ఐక్యతను చాటాలని, అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



భీంపూర్ మండలం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగా

పెన్‌గంగా నది పరివాహక ప్రాంతాలకు 'మహా' ప్రభుత్వం హెచ్చరిక

● ఇసాపూర్ డ్యాం గేట్లు ఎత్తివేత ● పెన్‌గంగకు భారీ వరద

ఆదిలబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గత రాత్రి నుంచి కురుస్తున్న అతి భారీ వర్షాలతో పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలోని గ్రామాలకు మహారాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీచేసింది. మహారాష్ట్ర లోని ఇసాపూర్ డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టడం 438.64 మీటర్లకు చేరుకోవడంతో వరద గేట్లను ఎత్తి దిగువకు వరద నీటిని వదులుతున్నారు. దీంతో పెన్‌గంగా నదిలో భారీ వరద ప్రవాహం పెరిగింది. దీంతో మహారాష్ట్రలోని యావత్‌మాల్, హింగోలి, నాందేడ్ జిల్లాలతో పాటు ఆదిలాబాద్ జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కోర్టా- చనకా బ్యారేజి వద్ద 1,90,000 క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళ్తుందని అధికారులు పేర్కొంటున్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో పెన్‌గంగానది పరిసరాలోకి పశువుల కాపరులు రైతులు వెళ్లరాదంటూ హెచ్చరికలు జారీ చేశారు.

వాగుల వద్ద పోలీసుల పహారా

భీంపూర్, సెప్టెంబరు 1: జిల్లాలో భారీ వర్షాలతో మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతుండగా భీంపూర్ పోలీసులు అక్కడ ఉంటూ రాకపోకలను నియంత్రిస్తున్నారు. నిపాని వద్ద లోలెవల్ వంతెన పైనుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుండడంతో భీంపూర్ ఎస్సై మహ్మద్ ఖలీం సిబ్బందితో కలిసి అక్కడే ఉండి వాహనాలను నిలిపివేస్తున్నారు. పోలీసులు, తహసీల్దార్, అధికారులు పగలు, రాత్రి గ్రామాల్లో తిరుగుతూ ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు.



నిపాని వద్ద పొంగిపొర్లుతున్న వంతెన వద్ద రాకపోకలను నిలిపివేసిన భీంపూర్ పోలీసులు

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి

● ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి

నిర్మల్ టౌన్, సెప్టెంబరు 1: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని తెలంగాణ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. మిట్టపల్లి నర్సయ్య లింబా(కె)లో పీజీ హెచ్‌ఎంగా విధులను నిర్వహించి పదవీ విరమణ పొందారు. 37 ఏళ్ల ఎనిమిది నెలల ఉద్యోగ కాలంలో మచ్చలేని మనిషిగా తమ విధులను నిర్వహించారని కొనియాడారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శిని నగర్ నర్సయ్య స్వగృహంలో ఆయనకు శాలువా కప్పి మెమెంటోతో ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి, పీఆర్‌టీయూ నేతలు, సంఘాల నేతలు, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల ప్రతినిధులు ఆయన సేవలను గుర్తు చేశారు. అనంతరం మిట్టపల్లి నర్సయ్య మాట్లాడుతూ... ఉపాధ్యాయుడు నుంచి జిల్లా విద్యాశాఖ అధికారి వరకు ప్రతి ఒక్కరూ తమకు సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, నరేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

'వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి'

● జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్

పెంబి, సెప్టెంబరు 1: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాబోయే రెండు రోజుల్లో అధిక వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పను లు ఉంటే తప్ప ప్రజలు బయటకు రావద్దని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని, అధికారులను సంప్రదించాలన్నారు. అధికారులు విధులకు హాజరై క్షేత్రస్థాయిలో పని చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్, ఆర్ఐ శ్రావణ్ కుమార్ రెడ్డి, అధికారులు ఉన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 1: అప్పులు ఇచ్చిన వారి వేధింపులకు గురైన ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో జరిగింది. కుటుంబీకులు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏమాయికుంట గ్రామానికి చెందిన కేంద్రే దత్త (41) డ్రైవర్‌గా పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత సంవత్సర కాలం క్రితం ఇంటి అవసరాల కోసం ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన కేంద్రే శివాజీ వద్ద రూ.6 లక్షలు, గోర్పనే దీప నుంచి రూ.50 వేలు, ఆదిలాబాద్ మండలంలోని చిచ్‌దరిఖానాపూర్ గ్రామానికి చెందిన పవార్ ప్రకాష్ దగ్గర నుంచి రూ.3 లక్షల 50 వేలు అప్పు తీసుకున్నాడని తెలిపారు. కాగా అప్పు ఇచ్చి న వారు ప్రతి రోజూ ఇంటికి వచ్చి డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వేధించాడని, డబ్బులు ఇవ్వకుంటే ఉరి వేసుకుని చనిపో అంటూ హిం సించారని తెలిపారు. తీసుకున్న అప్పు తీర్చేందుకు తన వద్ద డబ్బులు లేక పోవడంతో అప్పుల బాధ భరించలేక ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకునట్లు తెలిపారు. కొన ఊపిరితో ఉన్న దత్తను కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు రిమ్స్ ఆసుపత్రికి సందర్శించి దత్త మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని పంచనామా నిర్వహించి మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. భార్య ఆశాతాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఆశాతాయితో పాటు కొడుకు అనికేత్, కావేలిలు ఉన్నారు. ఉరి వేసుకుని కేంద్రే దత్త ఆత్మహత్య చేసి మృతి చెందడంతో ఏమాయికుంట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఐదు కిలోల గంజాయి పట్టివేత

బోథ్, సెప్టెంబరు 1: మండలంలోని మరలపెల్లి గ్రామానికి చెందిన శిరీష్ వంశీ అనే యువకుడు ఐదు కిలోల గంజాయిని తీసుకుని వస్తుండగా మరల పెల్లి గ్రామం సమీపంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆసిఫాబాద్ ప్రాంతం నుంచి ఐదు కిలోల గంజాయిని తీసుకు వస్తున్నట్లు ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు యువకుడిని ట్రాక్ చేసి వల పన్ని పట్టుకున్నట్లు సమాచారం. నెల రోజుల క్రితం మండ లంలోని గుర్రాల తండా గుట్ట పక్క తండా, సోనాల గ్రామాలల్లో గంజాయి విక్రయదారులను పట్టుకున్నారు. దీంతో మండలంలో గంజాయి వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

ఆన్‌లైన్ వ్యాపారం పేరిట

అమాయకులకు ఎర!

» అమాయకులను బుట్టలో వేసేందుకు కోట్లు వస్తున్నట్లు ముమ్మర ప్రచారం » సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు

» 2016లోనే రూ.50 కోట్లతో బోర్డు తిప్పేసిన వన్ ఫోరెక్స్ » తాజాగా నిర్మల్‌లో రూ.100కోట్లతో బోర్డు తిప్పేసిన పీఎస్‌ఏ, వీసీఐ

» కేటుగాళ్లపై పోలీసుల కొరడా » నిర్మల్‌లో ఓ ఎక్సైజ్ ఎస్సై, ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు, కానిస్టేబుల్ సహా పలువురు అరెస్ట్

» జిల్లా స్థాయిలో ఓ ఉన్నతాధికారి మద్దతుతోనే తరుచూ దేశం దాటుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు?



ఆన్‌లైన్ వ్యాపారంపై ప్రెస్‌మీట్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ



నిందితులను నిర్మల్ సబ్ జైలుకు తరలిస్తున్న పోలీసులు


నిర్మల్‌లో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

నిర్మల్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): రూ.లక్ష పెట్టుబడితో నెలకు రూ.15వేల వడ్డీ అని ఒకరు.. రూ.96వేలు పెట్టుబడి పెడితే నెలలోనే రూ.8.5 లక్షల ఆదాయమని మరొకరు.. రూ.3,50,000 పెడితే 45 రోజుల్లో రూ.7లక్షల ఆదాయమంటూ ఇంకొకరు. ఇవన్నీ విని నిజమని భావించి పెట్టుబడి పెట్టి కొంతమంది అమాయకులు నిండా మునిగారు. సమాజంలో మంచి పేరున్న పెద్ద మనుషులు, ప్రభుత్వ ఉద్యోగులు అమాయకులను బుట్టలో వేయడమే పనిగా ఈ నయవంచనకు నాందిపలికారు. ప్రస్తుతం మార్కెట్‌లో జోరుగా చలామణిలో ఉన్న ఆన్‌లైన్ వ్యాపారం ద్వారా ఈ ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న ప్రబుద్ధుల మాటలు నమ్మి అమాయకులు మోసపోయారు. పీఎస్‌ఏ, వీసీఐ, వన్ ఫోరెక్స్, మోటాఫండ్, మెటామాస్క్, యేనిటీ మెటా, యూబిట్ కాయిన్, క్రిప్టో కరెన్సీ ఇలా రకరకాల పేర్లతో ఆన్‌లైన్‌లో కరెన్సీ దందా నడుపుతూ కొంతమంది కేటుగాళ్లు అమాయక జనం నుంచి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఈ దందా జోరుగా చలామణి అయ్యేందుకు ప్రభుత్వ ఉద్యోగులే ప్రధాన పాత్రదారులుగా మారడంతో అమాయక ప్రజలు తమ ఇళ్లు గుల్ల చేసుకుంటున్నారు.

● రూ.100 కోట్లతో బోర్డు తిప్పేసిన పీఎస్‌ఏ, వీసీఐ

2016లో వన్ ఫోరెక్స్ అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా పెట్టుబడి 45 రోజుల్లో రెట్టింపు అవుతుందని అమాయకులకు ఆశ చూపారు. నమ్మిన అమాయకులు ఒక్కొక్కరూ రూ.35వేల నుంచి రూ.మూడున్నర లక్షల వరకు నష్టపోయారు. ఇలా కోట్లరూపాయలు పెట్టుబడులు జమ అవ్వగానే సదరు వన్‌ఫోరెక్స్ వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో మాయమైంది. దీంతో బాధితులు ఖానాపూర్ పోలీసులను ఆశ్రయించడంతో అప్పట్లో ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తాజాగా అదే దారిలో పీఎస్‌ఏ అనే ఆన్‌లైన్ యాప్, వీసీఐ అనే ఆన్‌లైన్ యాప్‌బోర్డు తిప్పేయడంతో అందులో పెట్టుబడులు పెట్టిన బాధితులు లబోదిబోమంటున్నారు. అప్పట్లో వన్‌ఫోరెక్స్ ద్వారా కేవలం ఖానాపూర్, కడెం మండలాల్లోనే రూ.50కోట్లకు పైగా మోసపోయినట్లు బాధితులు చెబుతున్నారు. తాజాగా పీఎస్‌ఏ, వీసీఐ బోర్డు తిప్పడంతో జిల్లావ్యాప్తంగా బాధితులు రూ.100కోట్లకు పైగా డబ్బులను నష్టపోయినట్లు తెలుస్తోంది.

● ప్రభుత్వ ఉద్యోగులే ప్రధాన సూత్రధారులు

ఈ ఆన్‌లైన్ వ్యాపారం చెలామణిలోకి రావడానికి ప్రభుత్వ ఉద్యోగులే ప్రధాన సూత్రధారులుగా మారుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం ద్వారా వస్తున్న జీతం సరిపోదన్నట్లుగా వ్యవహరిస్తున్న కొంతమంది ఈజీ మనీ సంపాదనే ధ్యేయంగా ఆన్‌లైన్ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. తాము రూ.లక్షల్లో పెట్టుబడులు పెడుతూ అదనపు వడ్డీని ఆశిస్తున్న సదరుఉద్యోగులు తమ కింద మరికొంత మందిని జాయిన్‌చేయడం ద్వారా బోనస్ పొంది తాము పెట్టిన పెట్టుబడి త్వరగా రావాలని అమాయకులకు ఎరవేస్తున్నారు. దీనికోసం తమకు నెల రోజుల వ్యవధిలోనే రూ.80లక్షల నుంచి రూ.కోటి వరకు లాభాలు వస్తున్నట్లుగా సామాన్యులను నమ్మిస్తూ సోషల్‌మీడియా వేదికగా ముమ్మర ప్రచారానికి తెరలేపారు. తాజాగా నిర్మల్ జిల్లా పోలీసు యంత్రాంగం ఈ ఆన్‌లైన్ వ్యాపారంపై దృష్టి సారించడంతో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర బయటికొచ్చింది. ఆర్మూర్‌లో ఎక్సైజ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గంగాధర్, ఏఆర్ పోలీస్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహేష్, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న సాయికిరణ్, కండెల నరేష్ ఈ వ్యాపారంలో ప్రధానపాత్ర పోషిస్తూ అమాయకులను ఇందులో పెట్టుబడులు పెట్టిస్తూ నిండాముంచుతున్నారని నిర్ధారించి వారిని అరెస్ట్ చేశారు. అమాయక ప్రజలను అప్రమత్తం చేస్తూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా కాపాడాల్సిన స్థానంలో ఉన్నప్రభుత్వ ఉద్యోగులే వారి ధనార్జన ధ్యేయంగా అమాయకులను ఇటువంటి ఈజీ మనీ సంపాదనకు అలవాటు చేస్తూ మోసపోయేలా చేయడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● విధులకు ఎగనామం పెట్టి విదేశాలకు..

సదరు ఆన్‌లైన్ వ్యాపారంలో తాము ఫైవ్‌స్టార్ అయ్యామని, తమకు సదరు కంపెనీ విదేశాలకు ట్రిప్పు పంపుతుందని చెప్పుకుంటూ కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు విధులకు ఎగనామం పెట్టి విదేశాలకు జల్సాల కోసం వెళ్లడం చూస్తే ఈ వ్యాపారం ఎంత పెద్దఎత్తున సాగుతుందో తెలిసిపోతోంది. కడెంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు ఇటీవల కాలంలో రెండుసార్లు శ్రీలంక దేశంలోని కొలంబోకు ట్రిప్పువెళ్లి జల్సాలుచేసి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. మొదటిసారి వెళ్లినప్పుడు కేవలం తాను ఒక్కడే వెళ్లినసదరు ఉపాధ్యాయుడు రెండోసారి వెళ్లినప్పుడు కడెంలోని లింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడిని సైతం కొలంబోకు తీసుకెళ్లి జల్సా లు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యంగా కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ వ్యాపారంలో కీలక పాత్రను పోషిస్తున్నట్లు చెబుతున్నారు. విధులకు ఎగనామం పెట్టి పదేపదే దేశం దాటి వెళ్తున్నా చర్యలు తీసుకో వాల్సిన జిల్లాస్థాయి అధికారి వారికిఅండగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ వ్యాపారం ద్వారా వీళ్లకు వస్తున్న రూ.కోట్ల నుంచి సదరు జిల్లాఅధికారికి సైతం వాటా ముడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. తాజాగా పట్టుబడిన వారిలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉండడం అందులో ఉపాధ్యాయులు ఇప్పటికే రెండుసార్లు శ్రీలంక దేశానికి జల్సాల కోసం వెళ్లినట్లు చెబుతున్నారు.

● తీగ లాగితే కదులుతున్న డొంక..

ఆన్‌లైన్ మోసాలపై దృష్టిసారించిన జిల్లాపోలీసులు క్రమేపి తీగ లాగుతుండడంతో ఈ అక్రమార్కుల డొంక కదులుతున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఓ ఎక్సైజ్ ఎస్సై, ఏఆర్ కానిస్టేబుల్, ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులతోపాటు పలువురిని అరెస్ట్ చేసిన పోలీసులు ఈ తదంగం వెనుకఉన్న మరింత మందిపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు మరికొంత మంది ఆయా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై పోలీసులు నిఘాపెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఆన్‌లైన్ మోసాలకు నాంది పలికేలా వ్యవహరిస్తూ అమాయకులను బుట్టలో వేసుకొని రూ.లక్షలను పెట్టుబడులు పెట్టిస్తున్న మరింత మందిని త్వరలోనే అరెస్టులు చేయనున్నట్లు తెలుస్తోంది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొంతమంది ప్రధానరాజకీయ నాయకులు సైతం ఈ ఆన్‌లైన్ వ్యాపారంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టినట్లు జోరుగా ప్ర చారం సాగుతోంది. వారి పెట్టుబడులను త్వరగా తిరిగి పొందేందుకు గ్రామాల్లో ఉన్న అమాయకు లను ఈ వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టించే లా ప్రోత్సహిస్తున్న రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారవేత్తలపై పోలీసులు నిఘా ఎట్టినట్లు తెలుస్తోంది.

శ్రీలంక ట్రిప్పు వెళ్లే ముందు ఫ్లైట్ వద్ద సెల్ఫీ దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు





ప్రొజెక్టర్ ద్వారా లావాదేవీలు చూపిస్తున్న దృశ్యం


నీటి లీకేజీల వద్ద ప్లాస్టిక్ టబ్బులను ఉంచిన ఆలయ సిబ్బంది

ఆలయంలో నీటి లీకేజీలు ఇంకెన్నాళ్లో!?

బాసర, సెప్టెంబరు1: ప్రతీ వర్షాకాలం సీజన్‌లాగే ఈసారి కూడా ఎడతెరపి లేని వర్షాలకు బాసర సరస్వతి అమ్మవారి ఆలయానికి లీకేజీల సమస్య ఏర్పడింది. అమ్మవారి ప్రధాన ఆలయం దాని ఎదురుగా ఉండే అర్ధమండపం శిథిలావస్థకు చేరడంతో వర్షపునీరు లీకవుతోంది. పలుచోట్ల నీరు ధారాలంగా రావడంతో ఆలయ సిబ్బంది ప్లాస్టిక్ డబ్బాలను ఉంచారు. భక్తులు దర్శనం చేసుకునే మార్గాలోనే లీకేజీ ఏర్పడడం, ఆలయంలో తడిగా మారి భక్తులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఆలయాన్ని పునర్నిర్మించాలని గత కొన్నేళ్లుగా దేవస్థాన అధికారులు ప్రయత్నిస్తున్నా కార్యరూపం దాల్చడంలేదు. ఫలితంగా శిథిలావస్థకు చేరి, ఇరుకుగా ఇప్పటి రద్దీకి అనుకూలంగా లేక భక్తులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎంపీడీవో

లక్ష్మణచాంద, సెప్టెంబరు1: భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాధా రాథోడ్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. రాబోయే మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రాకూడదన్నారు. అలాగే లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు వచ్చినట్లయితే వెంటనే మండల అధికారులకు, గ్రామ పంచాయతీ అధికారులు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కనకాపూర్ గ్రామంలోని కెనాల్ వద్ద వరద నీటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట స్థానిక సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

రెంకోని వాగు వద్ద ఖానాపూర్ సీఐ, ఎస్సై సహాయక చర్యలు


గుంతలు తవ్వుతున్న సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి, పోలీసు సిబ్బంది

ఖానాపూర్, సెప్టెంబరు1: భారీ వర్షాలకు మండలంలో రెంకోనివాగు పొంగి ప్రవహించడంతో ఖానాపూర్-తర్లపాడ్ రహదారి, ఖానాపూర్-దిలావర్‌పూర్ రహదారి తెగి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రెంకోనివాగును పరిశీలించేందుకు వెళ్లిన ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రిలు వాహనదారులు ఎవరూ అటువైపు వెళ్లకుండా వెంటనే వాగు వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయాలని భావించారు. భారీవర్షం కురుస్తుండడంతో ఎవరూ అందుబాటులో లేకపోవడంతో తామే రంగంలోకి దిగి గుంతలు తవ్వి కర్రలు పాతారు. తమ సిబ్బందిని సహాయం తీసుకొని బారికేడ్లను నిర్మించారు. ఆపత్కాలంలో ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఈ పోలీసులు స్వయంగా చేసిన పనిని పలువురు కొనియాడారు. సోషల్ మీడియాలో వేదికగా శభాష్ పోలీసన్న అంటూ పోస్టులు పెడుతున్నారు.


ఆదిలాబాద్‌లో అమ్మకానికి సిద్ధంగా అలంకరణ వస్తు, సామగ్రి

మార్కెట్లో పొలాల అమావాస్య సందడి

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 1: అన్నదాతలు అత్యంత ప్రీతి పాత్రంగా జరుపుకునే పోలాల అమావాస్య సందడి పల్లెల్లో కనిపిస్తోంది. సోమవారం పొలాల అమావాస్య పండగ ఉండడంతో అన్నదాతలు పండగకు సంబంధించి పనుల్లో నిమగ్నమయ్యారు. పండగకు అవసరమైన వస్తువులను ఖరీదు చేసేందుకు ఆసక్తి చూపడంతో ఆదివారం ఆదిలాబాద్‌లోని ప్రధాన వీధులు సందడి నెలకొంది. ఎద్దులను అందంగా అలంకరించడానికి అవసరమైన వస్తు సామాగ్రితోపాటు ప్రత్యేక పూజలు చేపట్టడానికి అవసరమైన వస్తు, సామగ్రిని ఖరీదు చేశారు.

● పల్లెల్లో మొదలైన పండుగ సందడి

తాంసి: రైతులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే పొలాల అమావాస్య పండుగ సందడి పల్లెల్లో మొదలైంది. బసవన్నల అలంకరణకు అవసరమయ్యే రంగులు, వస్త్రాలు, కాగితం పూలు, బెలూన్లు, రంగుల డబ్బాలను రైతులు కొనుగోలు చేస్తున్నారు. సోమవారం నిర్వహించే పండుగ సందర్భంగా పూజా సామగ్రి, పిండి వంటకాలకు కావాల్సిన సరుకులను కొనుగోలు చేస్తున్నారు. తలమడుగు, సుంకిడి, భీంపూర్, జైనథ్, బేల, తాంసి, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి.

● నేతకాని మహార్ కులస్థుల ఆధ్వర్యంలో..

ఉట్నూర్: మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నేతకాని మహార్ కులస్థుల అత్యంత పవిత్రమైన పొలాల అమావాస్య పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో కొత్తపల్లి గంగేశ్, జగనం నరేష్, దుర్గం స్వామి, దుర్గం సిద్ధార్థ రామ్మూర్తి, తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నేరడిగొండ, సెప్టెంబరు 1: అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందిన వారు సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. బజార్‌హత్నూర్ మండలకేంద్రానికి చెందిన గుండురుక్మకు రూ.22వేల 500, మండలంలోని దేగామ గ్రామా నికి చెందిన గాజుల సాయితేజకు మంజూరైన రూ.24వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం నేరడిగొండలోని ఆయన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో బజార్‌హత్నూర్ మండల యువ నాయకులు చిక్కాల జనార్ధన్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొచ్చెరలో ముగిసిన సప్తాహ

బోథ్, సెప్టెంబరు 1: మండలంలోని పొచ్చెరా గ్రామంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న సప్తాహ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నగర సంకీర్తన నిర్వహించిన భక్తులు హనుమాన్ ఆలయం లో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 1: హిందూ సంస్కృతిని చాటేలా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని హిందూ సమాజ్ ఉత్సవ సమితి అధ్యక్షులు హన్మండ్లు అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో గణేష్ ఉత్సవాలపై మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వాహణ, మండపాల బాధ్యతలు వంటి అంశాలపై చర్చించారు. విద్యుత్ కనెక్షన్ కోసం ఎలాంటి రుసుము చెల్లించొద్దని, కలెక్టర్‌తో ఈ విషయమై చర్చించడం జరుగుతుందన్నారు.

ఆదిలాబాద్‌లో దంచికొట్టిన వాన

● జిల్లావ్యాప్తంగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు ● మత్తడివాగు ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత ● ఉప్పొంగిన వాగులు, వంకలు

తాంసి, సెప్టెంబరు 1: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మత్తడి వాగు ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. ఆదివారం ఉదయం గంటన్నర పాటు కుండపోతగా కురియడంతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా, ఆదివారం సాయంత్రానికి 277.20 మీటర్లకు చేరుకుంది. దీంతో అప్రమత్తమైన సంబంధిత శాఖ అధికారులు మూడు గేట్లు ఎత్తివేశారు. దీంతో 17 వేల క్యూసెకుల నీటిని బయటకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 8,020 క్యూసెకుల నీరు వచ్చి చేరుతోందని సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తోంది. ఇదిలా ఉంటే మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న వాగులు, వంకలు, చెరువులన్నీ పూర్తిగా నిండిపోయి పొంగిపొర్లుతున్నాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. పంట పొలాల్లో భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో తమకు నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. నష్టం బారీన పడిన బాధిత కుటుంబాలను ఆదివారం మధ్యాహ్నం ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి, తదితరులు సందర్శించి పరిశీలించారు.

● అర్ధరాత్రి దంచికొట్టిన వాన

తలమడుగు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో శనివారం అర్ధరాత్రి కురిసిన భారీవర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో జనజీవనం స్తంభించిపోయాయి. వాగు పక్క చుట్టూ ఉన్న పంట పొలాల్లో భారీగా వర్షం నీరు రావడంతో పత్తి పంటలోకి నీరు తెచ్చి చేతికొచ్చిన పత్తి పంట నీట మునిగిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం కురిసిన వర్షాలతో మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. అదేవిధంగా మండలంలోని పూనగూడ గ్రామంలోని ఇళ్లలోకి వర్షపునీరు రావడంతో ఆహార ధాన్యాలు నిత్యావసరాల వస్తువులు తడిసిముద్దయ్యాయని అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా దేగామా, ఉమ్రి, కోసాయి, మండగూడ, ఖపర్‌దేవి, తలమడుగు ఝరి, సుంకిడి, తదితర గ్రామాల్లో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బ తిన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

● లోలెవల్ వంతెనల పైనుంచి వరద ప్రవాహం

భీంపూర్: శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. సవర్గం-పిప్పల్‌కోటి, నిపాని, సెంటర్ సాంగ్వి, వాడ్గూర్, అంతర్గం, నడుమ ఉన్న లోలెవల్ వంతెనలపై నుంచి వరద ప్రవాహంతో రాకపోకలు స్తంభించాయి. పిప్పల్‌కోటిలో శనివారం రాత్రి గాలివానకు భారీ చెట్లు విరిగి 11కేవీ వైర్ పడటంతో వైర్ తెగిపోయింది. మండలంలో వందల ఎకరాలు పంట చేల్లు నీటమునిగిపోవడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. తక్షణమే వ్యవసాయ అధికారులు పంట నష్టం సర్వే చేపట్టాలని తాజా మాజీ వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, రైతు సంఘం నాయకుడు అశోక్, తదితరులు కోరుతున్నారు.

● జలమయమైన ఇచ్చోడ ప్రధాన రహదారి

ఇచ్చోడ: మండలంలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు ఏకధాటిగా వర్షం కురుస్తునే ఉంది. ఇచ్చోడ మండల కేంద్రంలో ఓపక్క రహదారి పనులు కొనసాగుతుండడంతో దారులన్నీ బురదమయంగా మారాయి. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి రోడ్డుపై పడిపోతున్నాయి. ఇచ్చోడ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో డ్రైనేజీలు సరిగ్గా లేకపోవడంతో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా సోమవారం ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఉరుములు మెరుపులతో కూడిన భారీవర్షం కురవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.


తలమడుగు మండలం పూనగూడలో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

● ఎక్కడికక్కడ స్తంభించిన జన జీవనం

భోథ్: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాల సమీపంలోని వాగులు ప్రవహిస్తున్నాయి. మండలంలోని సోనాల వాగుతో పాటు కరత్వాడ గ్రామం సమీపంలోని వాగు ఉప్పొంగి ప్రవహించాయి. ఫలితంగా లోతట్టు ప్రాంతాలలో ఉన్న పంట చేలు మునిగిపోయాయి. కరత్వాడ వాగు పొంగి ప్రవహించడంతో చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు రాకపోకలకు నిలిచిపోయాయి. ఇక వాగు ఉధృతి వల్ల పంట చేలలో భూములు కోతకు గురయ్యాయి. మరోవైపు పంట పొలాల్లో అక్కడక్కడ ఇసుక మేటలు వేశాయి. అప్రమత్తమైన అధికార యంత్రంగం భారీ వర్షాల కారణంగా మండలంలో అధికార యంత్రం అప్రమత్తమైంది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ సుభాష్‌చంద్రతో పాటు రెవెన్యూ అధికారులు అప్రమత్తమై పలు గ్రామాల ప్రజలకు సూచనలు చేశారు. మరో వైపు అభివృద్ధి వల్ల గ్రామాలు ముంపుకు గురైతే చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై స్థానిక నాయకులతో చర్చించారు.

● జాగ్రత్తలు పాటించాలంటున్న పోలీసులు

ఉట్నూర్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఏకధాటిగా శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు వర్షం కురుస్తునే ఉంది. కురుస్తున్న వర్షాలకు ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్ జె, వంకతుమ్మ, గంగాపూర్, పెరికగూడ, దంతన్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పోలీసులు ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ప్రజలకు అవగాహణ కల్పిస్తున్నారు. ఆదివారం ఉట్నూర్ సీఐ గండికోట మొగిలి, ఉట్నూర్ ఎస్సై మనోహార్ తమ పోలీసు సిబ్బందితో వెళ్లి దంతన్‌పల్లి, నర్సాపూర్‌జె గ్రామాల మధ్య ఉన్న వాగును సందర్శించి అక్కడి ప్రజలకు తగు సూచనలు చేశారు. భారీ వర్షాలు దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప ఎవరు బయటకు రాకూడదని విద్యుత్ స్థంబాలకు దూరంగా ఉండాలని వాగు దాటేప్పుడు జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు తగు సూచనలు చేశారు. అంతేకాకుండా అత్యవసరంగా వెళ్లే వారి కోసం రెండు వైపులా తాడుకట్టి అత్యవసరం అయితేనే వెళ్లాలని కోరారు. కాగా, ఆదివారం రాత్రి మండలకేంద్రంలోని గిరిజన సహకార సంస్థ సూపర్‌బజార్‌పై పిడుగు పడింది. దీంతో మంటలు చెలరేగడంతో స్థానికుల సమాచారం మేరకు అక్కడి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.


మత్తడివాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేసిన దృశ్యం

● సాత్నాల ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

జైనథ్: మండలంలోని ఆయా గ్రామాలలో శనివారంరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో జైనథ్ మండలంలోని మధ్య తరహా ప్రాజెక్టు అయిన సాత్నాలలో భారీగా వరద నీరు చేరడంతో ప్రాజెక్టుఉన్న నాలుగు గేట్లలో ఆదివారం వేకువ జామున మూడు గేట్లను నీటి పారుదల శాఖ అధికారులు తెరిచి వరద నీటిని దిగువ ప్రాంతానికి వదిలి వెళ్లారు. సాత్నాల ప్రాజెక్టు గరిష్ట సామర్థ్యం 286.50 అడుగులు కాగా 285.80అడుగులకు వరద నీరు రావడంతో మూడు గేట్లను తెరిచి వరద నీటిని వదిలారు. ప్రాజెక్టు గరిష్ట సామర్థ్యం 1.24 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.01 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు పిల్‌వే 6800 క్యూసెక్కులు కాగా ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 6200 క్యూసెక్కులు కాగా ఔట్ ఫ్లో 6800 క్యూసెక్కులుగా ఉంది. సాత్నాల ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్, ఏఈ మారుతిలు పరిశీలిస్తున్నారు. అలాగే, మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని బహాదూర్ వద్ద గల తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దున గల బ్రిడ్జిపై నుంచి పెన్‌గంగా నది ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. బేల మండల కేంద్రానికి వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్ జైనథ్ మండంలోని లక్ష్మీపూర్ గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో విద్యుత్‌సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షం కురవడంతో జనజీవనం అస్థవ్యస్థంగా మారింది.

● ఉప్పొంగిన వాగు.. రాకపోకలు బంద్

ఆదిలాబాద్ రూరల్: నిన్నటి నుంచి ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. కాగా ఆదిలాబాద్ రూరల్ మండలంలో పొచ్చెర గ్రామ సమీపంలోని వాగు రోడ్డు పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకులు నిలిచి పోయాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.


భీంపూర్ మండలం పిప్పల్‌కోటిలో నీటిని మళ్లిస్తున్న రైతులు


ఇచ్చోడ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు


బ్రిడ్జిని ఆనుకొని ఉప్పొంగి ప్రవహిస్తున్న సోనాల వాగు

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.1 కనిష్ఠం 24.3



'విరిగిన నవగ్రహ విగ్రహాలను పునఃప్రతిష్ఠించాలి'

బాసర, సెప్టెంబర్, 1: పవిత్ర గోదావరి నది తీరంలో శివాలయంలో గల నవగ్రహ విగ్రహాల్లో కొన్ని విరిగిపోయాయి. ఈ విషయాన్ని స్థానికులు ఆదివారం ఆలయ అధికారుల దృష్టికి తెచ్చారు. వాటి స్థానంలో కొత్తవి పున ప్రతిష్ఠించాలని స్థానికులు కోరారు. జాప్యం లేకుండా కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో ఆలయ ఈవో విజయ రామారావు ఈ విషయం తమదృష్టికి వచ్చిందని దేవస్థాన అర్చకులతో చర్చించామని త్వరలోనే కొత్తవి ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.



జిల్లాలో విస్తారంగా వర్షాలు

- జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు
- కుభీర్‌లో అత్యధికంగా 128.5 మి.మీ. వర్షపాతం నమోదు
- ప్రాజెక్టులకు పోటెత్తిన వరద
- పొంగుతున్న చెరువులు, వాగులు
- కడెం ప్రాజెక్టు 10 గేట్ల ఎత్తివేత
- ఖానాపూర్, కడెం మండలాలకు, ఝురి (బి)కి రాకపోకలు బంద్
- నీట మునిగిన పంటలు
- జలదిగ్బంధంలో లోతట్టు ప్రాంతాల గ్రామాలు



సాయి మాధవ్‌నగర్‌లో ఇంటిలో చేరిన నీరు

ఖానాపూర్ / ముథోల్ / భైంసా, సెప్టెంబరు1: జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేని వర్షం కురవడంతో జనజీవనం అతలాకుతలమవుతోంది. భారీవర్షాలతో వాగులు, ఒర్రెలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎడతెరిపి లేని వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని 19మండలాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. భారీ వర్షాలకు, వరదలకు అనుకోని ఇబ్బందుల్లో చిక్కుకున్న ప్రజలకు కంట్రోల్‌రూమ్‌ల ద్వారా సహాయక చర్యలను అందిస్తామన్నారు. అత్యవసరమైతే తప్ప ఇంట్లో నుంచి బయటకు వెళ్లవద్దని అధికారులు ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశారు. కడెం ప్రాజెక్టుకు భారీగా వరద రావడంతో అధికారులు అప్రత్తమై 10 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. జిల్లాలో అత్యధికంగా కుబీర్ మండలంలో 129 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

ఉప్పొంగిన రెంకోని వాగు..

ఖానాపూర్ ప్రాంతంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. భారీ వర్షానికి మండలంలో రెంకోని వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. వాగుఉధృతికి ఖానాపూర్ - తర్లపాడ్, ఖానాపూర్-దిలావర్‌పూర్ గ్రామాల నడుమ గల తాత్కాలిక రోడ్డుతెగిపోయింది. దీంతో కడెం-ఖానాపూర్ మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఖానాపూర్ నుంచి కడెం వెళ్లాల్సిన ప్రజలు, కడెం నుంచి ఖానాపూర్ రావాల్సిన ప్రజలు సుమారు 10కిలోమీటర్లకు పైగా తిరిగి రావాల్సి వస్తోంది.

సాగునీటి ప్రాజెక్టులకు పోటెత్తిన వరద

ఎగువన కురుస్తున్న భారీవర్షాలకు నిర్మల్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నీరువచ్చి చేరుతోంది. కడెం ప్రాజెక్టులోకి 65వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు 10 వరద గేట్లను ఎత్తి దిగువకు 79,850 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిలో సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 6.361 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. స్వర్ణ ప్రాజెక్టులోకి 15వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో 3 వరద గేట్లను ఎత్తి20వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తినీటి నిల్వసామర్థ్యం 1.484 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.484 టీఎంసీల నీరు నిల్వఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి 30వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు పూర్తినీటి నిల్వ సామర్థ్యం 1.852 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.525 టీఎంసీల నీరు నిల్వఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఖానాపూర్‌లోని మేడంపల్లి అడవుల్లో గోదావరి నదికి అడ్డంగా నిర్మించిన అతిపురాతన ఆనకట్ట సదర్మాట్ వద్ద గోదావరి జలాలు రాతి మత్తడి దూకుతోంది. ప్రాజెక్టులకు భారీగా వరద వస్తుండడంతో ప్రజలెవరూ గోదావరి నది తీరం వైపు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. జిల్లాలో మరో రెండురోజులు వర్షాలు కురుస్తాయని చెబుతూ ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేసి సహాయం పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

కుభీర్‌లో 128.5 మి.మీ. వర్షపాతం

భైంసా డివిజన్ పరిధిలో రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. ఆదివారం డివిజన్ పరిధిలోని కుభీర్‌లో 128.5 మి.మీ., భైంసాలో 89.3 మి.మీ., కుంటాలలో 79.8 మి.మీ., ముథోల్‌లో 62.8 మి.మీ., లోకేశ్వరంలో 54.3 మి.మీ., తానూర్‌లో 52.5 మి.మీ., లోకేశ్వరంలో 49మి.మీ., బాసరలో 25 మి.మీ. వర్షపాతం నమోదైంది. అన్ని ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉధృతితో ప్రవహిస్తున్నాయి. సీసీ, బీటీ రోడ్లు దెబ్బతిని గోతులమయమయ్యి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఎడతెరపిలేని వర్షంతో వ్యవసాయ పనులు నిలిచిపోగా రైతులు, వ్యవసాయ కూలీలు ఇంటికి పరిమితంకాగా పంటచేలు నీట మునిగింది. మురికి కాలువలు పొంగిపొర్లి రోడ్లపైకి ప్రవహిస్తుండటంతో అంతా అపరిశుభ్ర వాతవరణం నెలకొంది.

నీట మునిగిన పంటలు

ముథోల్ మండలంలో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వ్యవసాయ చేనులో పంటలు నీట మునిగాయి. ముథోల్‌లోని సాయిమాధవ్ నగర్ రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాలనీ వాసులతోపాటు ఈ రోడ్డు గుండా రాకపోకలు కొనసాగించే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ఇళ్లలో వర్షపు నీరు చేరింది. ప్రతీ సంవత్సరం అధికారులకు, నాయకులకు తమ సమస్యను విన్నవించుకున్నప్పటికీ స్పందించే వారు కరువయ్యారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా మురికికాల్వలు లేకపోవడం, రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రతీసారి ఇబ్బందులు తప్పడంలేదు. ఇదే ప్రాంతంలో జ్యోతిబాపూలే పాఠశాల ఉండటంతో వర్షం నీరు పాఠశాల ఆవరణలోకి వచ్చాయి. భారీవర్షాలు కురియనున్న నేపథ్యంలో 5, 6, 7 తరగతుల విద్యార్థులకు రెండురోజులు సెలవులు ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ అమృత తెలిపారు. దీంతో పోషకులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. సాయిమాధవ్ నగర్‌లో ఇళ్లలో వర్షం నీరు చేరడంతో తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ నారాయణలు పరిశీలించారు. అలాగే అక్కడే ఉన్న జ్యోతి బాపూలే పాఠశాలను సందర్శించి పలు వివరాలు ప్రిన్సిపాల్‌కు అడిగి తెలుసుకుని వర్షం నీరును తొలగించేందుకు చర్యలు చేపట్టారు. పెద్దగుంతలలో మొరం వేసే ప్రక్రియ మొదలు పెట్టారు.

ఝురి(బి)కి రాకపోకలు బంద్

తానూర్: మండలంలోని ఝురి(బి) గ్రామరోడ్డు లోలెవెల్ వంతెనపై ఆదివారం ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి నీటి ప్రవాహం ఎక్కువయి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. అత్యవసర పనుల కోసం గ్రామం నుంచి బయటకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు తెలిపారు. వంతెనపై నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో విషయాన్ని తెలుసుకున్న తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో అబ్దుల్ సమ్మద్, సీఐ మల్లేష్, ఎస్సై సందీప్ వంతెన వద్దకు చేరుకొని నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన ఓ యువకుడి జేసీబీతో ప్రజలను రోడ్డు దాటించాడు. అదేవిధంగా మండలంలోని కళ్యాణీ గ్రామంలో భారీ వర్షం పడడంతో వర్షపు నీరు వీధుల గుండా ప్రవహిస్తూ ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు పాఠశాలలకు సెలవు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు1: భారీ వర్షాల దృష్ట్యా కలెక్టర్ ఆదేశాలమేరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు: కలెక్టర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు1: జిల్లాలో భారీ వర్షాల కారణంగా సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు కూడా సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ప్రజలు సురక్షితంగా ఉండేలా అన్నిసహాయక చర్యలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని, అత్యవసర సమయాల్లో 63056466600 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

కుంటాలలో భారీ వర్షం

కుంటాల, సెప్టెంబరు1: కుంటాల మండలంలో శనివారం రాత్రి భారీవర్షం కురిసింది. కొత్త వెంకూర్, పాత వెంకూర్, ఓలా సూర్యాపూర్, లింబా - ఓలా గ్రామాల మధ్యగల లోలెవల్ వంతెనలపై నుంచినీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్ గౌడ్, ఎస్సై భాస్కరాచారి పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

పెన్షన్ ఉద్యోగుల హక్కు

- టీఎన్జీవో అధ్యక్షుడు ప్రభాకర్
- నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 1: పెన్షన్ పొందడం ఉద్యోగుల హక్కు అని, ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదని టీఎన్జీవో సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయచ పెన్షనర్ల జేఏసీ పిలుపు మేరకు పెన్షన్ విద్రోహ దినం నిర్వహించారు. నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో పాత పెన్షన్ విధానం రద్దు చేసి నేటికి 20ఏళ్లు అయ్యిందని అన్నారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగులు మానసిక వేదనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత విధానంలో ప్రభుత్వం 10శాతం వాటాగా జమచేసి పదవీ విరమణ సమయంలో పెన్షన్ ఇస్తున్నారన్నారు. గ్రాట్యుటీ, కమ్యూటేషన్ లభించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న, గజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వీజీ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నరేంద్రబాబు, సాయన్న, నాయకులు, తదితరులున్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, నాయకులు

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంది


- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు1: జిల్లాలో భారీ వర్షాలు దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సిద్ధంగా ఉందని కలెక్టర్ అభిలాష అభినవ్ వివరించారు. ఆదివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సీఎస్ శాంతి కుమారితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజల నుండి ఫిర్యాదులు అందగానే అధికారులు స్పందించాలన్నారు. వరదలు ఎక్కువ వచ్చే అవకాశాలు ఉన్నచోట బోట్లను సమకూర్చుకోవాలని ఆదేశించారు. సీఎస్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంత ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని అన్నారు. జిల్లాల పరిస్థితి ప్రభుత్వ నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ జిల్లా పరిస్థితులు వివరిస్తూ శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అక్కడ నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టామన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలకు తాత్కాలిక పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలెవ్వరూ కుంటలు, చెరువుల వద్దకు చేపల వేటకు వెళ్లకుండా ప్రాజెక్టు పరిసరాల్లో పోలీసు నిఘా ఉంచామన్నారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ ఎలాంటి ఘటనలు జరుగకుండా పోలీసుశాఖ అప్రమత్తంగా ఉన్నట్లు వెల్లడించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులున్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

గడ్డెన్నవాగు ప్రాజెక్టు మూడు వరద గేట్ల ఎత్తివేత



స్వర్ణ ప్రాజెక్టు ద్వారా వదులు నీరు

భైంసా, సెప్టెంబరు1: గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ప్రాజెక్టులోకి 24,625 క్యూసెక్కుల వరద నీరు చేరింది. ఈ క్రమంలో శనివారం ప్రాజెక్టు నీటిమట్టం 357.7 మీటర్లు ఉండగా ఆదివారం భారీగా వరద వచ్చి చేరడంతో ప్రాజెక్టు నీటిమట్టం 358.5 మీటర్లకు ఎగబాకింది. ఆదివారం ఇన్‌ఫ్లో ఆధారంగా ముందుగా ఒక వరద గేటు ఎత్తి సుద్దవాగులోకి 5వేల క్యూసెక్కుల నీరు వదిలిన అధికారులు తదుపరి పరిస్థితులకు అనుగుణంగా మరో రెండు వరద గేట్ల ఎత్తిశారు. మూడుగేట్ల ద్వారా 30వేల క్యూసెక్కుల వరదను సుద్దవాగులోకి వదిలారు. ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదలను కొనసాగిస్తామని ప్రాజెక్టు డీఈ అనిల్‌కుమార్ తెలిపారు.

అప్రమత్తమైన ఆర్టీసీ అధికారులు

గడ్డెన్నవాగు మూడు వరద గేట్లను ఎత్తివేసి సుద్దవాగులోకి 30వేల క్యూసెక్కుల వరద నీటి వదిలివేయడంతో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. గత సంవత్సరం ఘటనలు పునరావృతం కాకుండా ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆదిలాబాద్ ఆర్ఎం కార్యాలయం నుంచి డిప్యూటీ రీజనల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ భైంసాకు చేరుకుని ఇక్కడే తిష్టవేశారు. డిపోలోని బస్సులన్నింటినీ సురక్షిత ప్రాంతాలకు తరలించారు. డిపోలో సిబ్బంది, కార్మికులు ఎవరూ ఉండకుండా బయటకు పంపించేశారు.

స్వర్ణ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

సారంగాపూర్, సెప్టెంబరు1: మండలంలో గల స్వర్ణ ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో గత రెండు రోజుల నుంచి కురిసిన భారీ వర్షానికి స్వర్ణ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు మొత్తం నీటి సామర్థ్యం 1183 అడుగులకు గాను 1183 అడుగుల వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తి 22,080 వేల క్యూసెక్కుల వరద నీరును దిగువన ప్రాంతానికి వదిలిపెట్టారు. ప్రస్తుతం 20,000 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. అలాగే స్వర్ణ వాగు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో పాటు చెరువులు, కుంటలు వరద నీరుతో నిండిపోవడంతో పాటు పంట పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



స్వర్ణ ప్రాజెక్టు ద్వారా వదులు నీరు

మా స్పెషల్ ఆఫీసర్.. మాకే కావాలి

- మేడం లేకపోతే టీసీ తీసుకొని వెళ్లిపోతాం
- కన్నీళ్లు పెట్టుకుంటున్న విద్యార్థులు
- ఆహారం తీసుకోకుండా విద్యార్థులు మేడం కోసం ఎదురుచూపులు

పెంబి, సెప్టెంబరు 1: మండలంలోని మందపల్లి గ్రామంలో కేజీబీవీ పాఠశాలలో ఎనిమిదేళ్లుగా పని చేస్తున్న స్పెషల్ అధికారి వీణ ఇటీవల బదిలీపెట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు 'మా స్పెషల్ ఆఫీసర్ మాకే కావాలి' అంటూ ఆదివారం 320 విద్యార్థులు హాస్టళ్లలో అన్నం తినకుండా ఏడుస్తూ పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. స్పెషల్ అధికారి వీణ మాకు అమ్మలా అందరినీ చూసుకుంటోందని, చిన్న జ్వరం వచ్చినా సొంత డబ్బులతో హాస్పిటల్‌కి పంపేదని చెప్పుకొచ్చారు. మేడం బదిలీ చేసుకొని వెళ్లిపోతుందని తెలిసింది. మేడం వెళ్లిపోతే మేము కూడా టీసీ తీసుకొని వెళ్లిపోతామని, లేదంటే 'మా మేడం మాకే కేటాయించాలి' అంటూ విలపించారు.



కన్నీళ్లు పెట్టుకుంటున్న విద్యార్థులు

మేడం లేకుంటే మేం వెళ్లిపోతాం..

- స్వీటి, ఇంటర్ ఫస్ట్‌ఇయర్



మా పాఠశాలలో మా స్పెషల్ అధికారి వీణ మేడం లేకుంటే మేము టీసీ తీసుకొని వెళ్లిపోతామని, మా అందరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా మేడం మాకు అమ్మలాగా ప్రతి ఒక్కరిని ఆదరించిందన్నారు. అధికారులు స్పందించి మా మేడం మాకు ఇక్కడే ఉంచాలని కోరుతున్నారు.

మేడం వచ్చేదాకా అన్నం తినం..

- అనూష, 10వ తరగతి



మాస్కూల్‌కి వీణ మేడం వచ్చేదాకా మేము అన్నం తినం. మా మేడం మా దగ్గరికి వచ్చి నేను ఇక్కడే ఉంటున్న అని చెప్పేదాకా అన్నం తినం. మమ్మల్ని అమ్మలాగా ఆదరించిందని, అధికారులు మా మేడంను మాకు వద్దకే పంపాలి.



స్వర్ణ ప్రాజెక్టు పరిశీలిస్తున్న కలెక్టర్

స్వర్ణ ప్రాజెక్టు పరిసర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలి: కలెక్టర్

సారంగాపూర్, సెప్టెంబరు 1: స్వర్ణప్రాజెక్టు పరిసరప్రాంత ప్రజలను అప్రమత్తంగా చేయాలని కలెక్టర్ అభిలాషఅభినవ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని స్వర్ణప్రాజెక్టును కలెక్టర్ అభిలాషఅభినవ్, ఎస్పీ జానకి షర్మిల ప్రాజెక్టును సందర్శించి ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రాజెక్టువద్ద నిరంతరంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు నిఘా పెట్టాలన్నారు. ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తే సమయంలో చుట్టుపక్కల ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రజలెవరూ చేపలవేటకు వెళ్లకుండా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాలతో ప్రాజెక్టులోకి వరద నీరుభారీగా చేరేఅవకాశం ఉన్నందున అధికారులు అందుబాటులో ఉంటూ పరిస్థితిని నింతరం తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు రవీందర్, లక్ష్మీ, డీఎస్పీ గంగారెడ్డి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్, అధికారులు ఉన్నారు.

పలు రైళ్ల రద్దు : ప్రయాణికులకు తిప్పలు



రైళ్ల రద్దుతో బాసర రైల్వే స్టేషన్‌లో ఆగినపోయిన ప్రయాణీకులు

బాసర, సెప్టెంబరు1: భారీవర్షాల కారణంగా బాసర రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దుచేశారు. సికింద్రాబాద్ నుంచి ముంబాయి వెళ్లే దేవగిరి ఎక్స్‌ప్రెస్ అదేవిధంగా సోమవారం ఉదయం ముంబాయి నుంచి వచ్చే దేవగిరి ఎక్స్‌ప్రెస్‌ను రెండురూట్‌ల నుంచి రద్దుచేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. దీంతో ఆయా రైళ్లకు వెళ్లే ప్రయాణికులు బాసరకు వస్తున్న భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.